# వరమీయని వేలుపు

మేఘాల రోదన —— ఆ కన్నీటిలా వర్షం. పశ్చిమ దిగ్మండలంలో అరుణిమలు —— రక్తం చిమ్ముతున్నట్టు. రణసూచన. కత్తులు ఝళిపిస్తున్నట్టు మెరుపులు. భీతావహంగా ఉంది. పెద్దగాలి. క్రమంగా విజృంభిస్తున్నది. ఆమె ఒంటరిగా ఆ గాలివానలో చిక్కుకుపోయింది. అంతవరకు అక్కడ కన్పించిన వంశవృక్షం, కన్పించలేదు.

ఆ స్వప్నంతో రత్నాలమ్మ కలవరపాటుతో నిద్ర లేచింది. ఇంకా భయం. వణికిపోతూనే ఉంది. గుండె కొట్టుకుంటూనే ఉంది. గ్రామ దేవత పోలేరమ్మను తలచుకుని కళ్లు తెరుచుకునేసరికి, ఉషోదయ సంచలనంతో ప్రకృతి కళకళలాడుతూ ఉంది. స్వప్నం గుర్తు తెచ్చుకోబోయింది. స్వప్నం గుర్తురాలేదు. గుండె కొట్టుకొంటున్నది. మనసంతా కలవరంగా ఉంది.

పెరట్లోకి చూసింది రత్నాలమ్మ. జామచెట్టు, మల్లెపొద, దొండపాదు, కొంత దూరాన —— ఎండి మోడయిపోతున్న మామిడి చెట్టు. ఆ వెనక కనుచూపు మేర పొలాలు ఆకుపచ్చగా. ఇంకా దూరంగా నీలం దిగంతాలు. ఆ మామిడిచెట్టు ఎండి మోడయి పోతుండటం చూసి మామయ్య... 'మన వంశవృక్షం ఇది' అనేవాడు. ఆ మాటలు గుర్తొస్తాయి రత్నాలమ్మకు. కండ్లు చెమరుస్తాయి. గుండె బరువెక్కుతుంది.

ఆ రోజు రోజంతా బందీలా కొట్టుకుంటుంది. భయపడుతుంది. పోలేరమ్మని తలచుకుని దండం పెట్టుకుని 'తల్లీ నీవే దిక్కు' అనుకుంటుంది. లేచి ఇంటి పనుల్లో నిండా మునిగిపోతుంది.

ఆ మామిడిచెట్టు కళకళ్లాడిననాడు ఇంట్లో కదురూ కవ్వం కిలకిల్లాడాయి. ఆ చెట్టు మూడు పూవులు ఆరు కాయలయింది. ఇల్లు నిత్య కళ్యాణం పచ్చతోరణం అయింది. మామిడిచెట్టు దగ్గర్లోనే చిన్నమొక్క ఒకటి ఇప్పుడు పెరుగుతున్నది. అయితే ఆ మొక్క బతుకుతుందని రత్నాలమ్మకు నమ్మకం కలగటం లేదు. ఎన్నో మొక్కలు మొలిచాయి. కాని ఏదీ పెరగలేదు. ఏ మేకో వచ్చి... ఎన్ని లాలిత్యాలు... ఎన్ని నాట్యాలు... ఎన్ని కిలకిలలు... ఎన్ని పరిమళాలు... ఎన్నెన్ని విద్దూరాలు... ఒక్క మొక్కనన్నా కాపాడుకోగలిగిందా? ఎన్ని ఆశలు రేకెత్తించేవి? ఎన్ని స్వప్నాలు?

కలువరేకుల మీంచి బాష్ప బిందువులు రాలాయి!

ఈ మొక్కను కూడా తను కాపాడుకోలేదా?

మొలిచి రెండేళ్లయిందేమో! ఎన్ని గండాలు! ఎన్ని బాలారిష్టాలు! పురుగుపట్టి ఆ లేత ఆకులు రాలిపోతున్నప్పుడు తల్లి పోలేరమ్మ ముందు కూర్చుని తలబద్దలు కొట్టుకునేది. ఏడ్చి ప్రార్థించేది. పూజించేది. ఈ ఒక్క మొక్కని బతికించు తల్లీ. గంపెడు గులక రాళ్లెందుకు? ఈ ఒక్క రత్నమూ నీ వరప్రసాదం అనుకుంటాం తల్లీ. నిన్నే కొలుచుకుంటాం తల్లీ... ఏటేటా మొక్కులు చెల్లించుకుంటాం తల్లీ... నీవు తప్ప మాకు దిక్కెవ్వరు తల్లీ... మొరపెట్టుకునేది.

కన్నీళ్లు పెట్టుకునేది.

'ఒరే అప్పన్నా! ఓ రెణ్నెల్లు మేకపాలు సంపాదించుకుంటే చెప్పు — మందిస్తాను. నీ కొడుక్కి ఏ జబ్బూ రాదు. ఏ ఆపదా ఉండదు...' అన్నాడు ఆ ఊరి వైద్యుడు. ఆమె కన్నీళ్లకు కరిగిపోయాడా వైద్యుడు.

మేకపాలు సంపాదించటం కూడా కష్టమనిపించే పేదరికం. ఎక్కడన్నా ఇంత ఆధారం దొరక్కపోతుందా? ఈ ప్రవాహం నించి బయట పడలేక పోతానా అన్న ఆశతో గుండె నిబ్బరం చేసుకున్నాడు అప్పన్న. ఆరుగురు పిల్లలు ఒకరి తర్వాత ఒకరు చనిపోయారు. పిల్లలు ఒకటి రెండేళ్లు వయసు పెరిగి హఠాత్తుగా ఏ జబ్బుతోనో చనిపోయిన వాళ్లే అంతా. కుమిలి కుమిలి ఏడ్చేది రత్నాలమ్మ. నిద్రాహారాలు ఉండేవి కావు. ఇరుగు పొరుగు వాళ్లు, బంధువులు వచ్చి ఓదార్చేవారు 'ఆ తల్లే తీసుకుపోయింది. ఆ తల్లే యిస్తాది' అని ధైర్యం చెప్పేవాళ్లు. పోలేరమ్మను వేడుకునే వాళ్లు.

రత్నాలమ్మ వీధిలోకి చూసింది.

ఎదురింట్లో నాయుడు గారమ్మాయి తన పాపని ఊయల్లోంచి తీసి ముఖం మీద ముద్దు పెట్టుకుని గుండెకు హత్తుకుంది. నాయుడు గారి భార్య ఈ అమ్మాయిని కన్న వారం దినాలకే చనిపోయినప్పుడు తనపాలు తాగే పెరిగింది. ఇప్పుడు తల్లి అయింది. తనను ఇన్నేళ్లూ అమ్మా అని పిలిచేవాళ్లే లేకుండా పోయారు. అమ్మా అని పిలిచే పిలుపు తన నొసట రాయలేదా భగవంతుడు... అని బాధపడింది. ఇప్పుడు పోలేరమ్మ దీవించి ఇచ్చింది ఈ బాబుని. వీడు మిగిలాడు.

పక్క పసులసాలలో నెమరువేసుకుంటున్న తల్లి మేక కన్పించింది.

ఆ మేకను చూస్తే రత్నాలమ్మకి ఇష్టం. గత జన్మలో ఏ మహాతల్లో ఈ జన్మలో ఈ మేకయిందని ఒక్కోసారి అన్పిస్తుంది. లోకం మిధ్య అన్నట్టుగా ఉన్నాయి ఆ తల్లి మేక చూపులు. దగ్గర్లోనే తల్లికి ఎడంగా కట్టేసిన మేకపిల్ల పాలకోసమేనేమో అరుస్తున్నది. తల్లిమేక పట్టించుకున్నట్టులేదు. ఆ మేకపిల్ల అమ్మా అమ్మా అని పిలుస్తున్నట్టా?

ఆ తల్లిమేకలో ఏ బాధా ఏభయమూ ఏ అనుమానమూ ఏ సంతోషమూ ఏ దుఃఖమూ ఉన్నట్టు కనబడదు. వేళకి ఇంత రొడ్డ, ఇంత గంజి, ఇన్ని నీళ్లు పెట్టే యజమానులు ఉన్నారన్న నమ్మకమో ఏమో, నిశ్చింతగా ఉంటుంది.

ఈ తల్లిమేకని బాబుకు పాలు తక్కువయినాయనే కొనుక్కున్నారు. దానిపాలుతోనే బాబు బతికాడు. వైద్యుడు మందు మేకపాలుతో కలిపి ఇవ్వమన్నాడు. తన కొడుకును కాపాడింది ఈ మేక. తొలి ఈత మేకపిల్ల మగది. ఇప్పుడు బాగా పెరిగింది. ఎగువ్వీధిలో తమ్ముడింట్లో ఉంది. ఆ మేకపోతు బాబుకి తమ్ముడు. ఇద్దరు ఒకే తల్లి పాలు తాగి పెరిగారు.

అంతా ఆ పోలేరమ్మ చలవ. ఆ తల్లి చల్లని చూపు. మరోసారి మనసారా ఆ తల్లిని తలచుకుని వందనం చేసుకుంది రత్నాలమ్మ.

తన పక్కలోని బాబు కదిలాడు. వీపు మీద చెయ్యేసి జోకొట్టింది. బాబు సర్దుకున్నాడు. నిద్ర పోతున్నాడు.

పిల్లమేక అరుస్తూనే ఉంది. తల్లిమేక పట్టించుకోదు. ఆకలికే అరుస్తున్నదేమో. తనే కట్టు తీసి విడవాలి. కాని విడవదు. ఇది వేళ కాదు. పాలు తాగేవేళకే విడిచి పెట్టాలి. ఆ తల్లిపాలని పిల్ల మేక స్వేచ్ఛగా తాగ నివ్వరు. కొన్ని పాలు తమకి కావాలి. అవి తీసుకున్న తర్వాత విడుస్తారు. పిల్లమేక కడుపు నిండుతుంది. తన బాబు కడుపు కూడా ఆ పాలతోనే నిండుతుంది.

ఈ తల్లిమేక లాంటిదే ఆ మామిడిచెట్టు. మొక్కలు చచ్చిపోయినప్పుడు కన్నీరు కార్చవు. తమకు చావు తెలీనట్టు.. తమకు ఏ బాధా లేనట్టు... తమకు ఏ దుఃఖం లేనట్టు ఏ చింతా లేకుండా ఉంటుంది.

ఈ మనుషులకే అన్ని బాధలూనూ.

'అమ్మా ఇదేమి లీల...' అనుకుంటుందామె.

లోకనింద తప్పలేదు. పుట్టిన పిల్లలు చచ్చిపోతున్నారు. ఏదో శాపం.

తన పిల్లల్ని తీసుకుపోవటానికి ఆ పోలేరమ్మకి ఎలా వొచ్చాయో చేతులు... అంతలోనే తల్లిని ---- ఆ పోలేరమ్మ తల్లిని నిందిస్తున్నందుకు బాధపడేది. ప్రార్థించేది.

* * *

ఏడాది కిందటి మాట.

రత్నాలమ్మ పొరిగింటికి వెళ్ళిందో ఏమో. అంతవరకు బైట స్నేహితులతో ఆడుకున్న బాబు అమ్మ వంటింట్లో ఉంటుందని అమ్మా అని పిలుచుకుంటూ వచ్చాడు. సాయంత్రం చీకటి. గదిలో వెల్తురు లేదు. కుండలు శబ్దం వినిపిస్తున్నది. నల్లగా కన్పించింది. సన్నని ఇరుకుద్వారం. ద్వారం దగ్గర మూడేళ్ల బాబు. ఆ నల్లని ---- కుక్కో మేకో తెలియక భయపడ్డాడు. జడిసిపోయి కెవ్వున అరిచాడు. కేకకి ఉలిక్కిపడిన మేకపోతు బైటకిపోతూ చెంగున ఎగిరింది. బాబును తాకుతూ బైటికి పారిపోయింది. బాబు ఇంకో గావుకేక పెట్టి నేలమీద పడిపోయాడు. అంతలోనే రత్నాలమ్మ వచ్చింది. పడిపోయి ఏడుస్తున్న బాబును ఎత్తుకుని గుండెకు హత్తుకుంది. అయినా వాడి భయం పోలేదు. ఏడుపు ఆగలేదు.

రెండు దినాల జ్వరం క్రమంగా వారానికి పెరిగింది. పక్షమయింది. వైద్యుడు మందులు ఇస్తూనే ఉన్నాడు. బాబు నిద్రలో కలవరిస్తున్నాడు. కండ్లు మూయకుండా చూస్తున్నాడు.

రత్నాలమ్మ కళ్లల్లో దీపాలు పెట్టుకుని చూసింది. చిక్కి శల్యమైపోయింది. ఆ పక్షం దినాలు ఆ ఇంట్లో నిద్రాహారాలు లేవు. పాలు కోసం తల్లిమేక నుంచుకుని, పిల్లమేకని ఎగువీధిలో ఉన్న తమ్ముని దగ్గరకు పంపించేసింది.

భూతవైద్యుని తెచ్చి చూపించారు ఊళ్లో పెద్దలు.

భూతవైద్యుడు ఓ అపర సంధ్యవేళ అయినింటిలో ఓ చదరంలో రంగు రంగుల ముగ్గులేసి మందారాలు, నవధాన్యాలు, మొక్కుబడులు అన్నీచేసి, పెద్దపెద్ద అరుపులు

అరచి, కులదేవతకు శాంతి చెయ్యండి, మేకపోతును అమ్మవారికి బలి ఇవ్వండి అని చెప్పి వెళ్లిపోయాడు.

అయినా బాబు జ్వరం తగ్గలేదు. మందులు ఇస్తూనే ఉన్నాడు వైద్యుడు. తగ్గిపోతుందని ధైర్యం చెప్తూనే ఉన్నాడు. రోజూ వచ్చి చూస్తూనే ఉన్నాడు.

ఈ సారి గ్రామపెద్దలు దాసుణ్ని తెచ్చారు.

అయినింటిలో ఈశాన్యం దిక్కున మట్టి నేలమీద ఆవుపేడతో అలికాడు. పద్మంలా ఆ అలికిన భాగం నిండేంత పెద్ద ముగ్గువేశాడు. ముగ్గు మధ్యలో తోమిన పెద్ద కంచు ముంత పెట్టాడు. ఆ ముంత మీద పది వత్తులతో దీపం వెలిగించాడు. ఒక్కో వత్తికి ఒక్కో దేవత పేరు పెట్టాడు. ఏ వత్తి పూలు రాలిస్తే ఆ దేవత పలికినట్టు. ఆ దేవతను కొలవాలి. అప్పుడే తన మొక్కుబడు లేమిటో చెప్తుంది ఆ దేవత దాసుడి వాణిగా.

చుట్టూ ఇరవై ముప్పయి మంది అమ్మలక్కలు చేరారు. ఏ దేవత పలుకుతుందో చూడాలి. ఆ అమ్మని వేడుకోవాలి...

జ్యోతులు వెలుగుతున్నాయి.

ముఖం నిర్మలంగా, కళ్లు కాంతివంతంగా, గంభీరంగా, ఆకర్షణీయంగా ఉన్నాడు దాసుడు. నుదుట కుంకుమ నిలువు బొట్టు కొత్త అందాన్నీ, తేజస్సునీ ప్రసాదిస్తున్నది. జుత్తు వీపుమీద వేలాడుతున్నది. బొద్దు మీసాలు. నెరసీ నెరవని గెడ్డమూ. పసుపు రంగు పంచె కట్టుకున్నాడు. శాంత స్వరూపంతో అనాది మునీశ్వరుడిలా కన్పిస్తున్నాడు.

కండ్లు మూసుకుని దేవత ఆవాహన కోసం ఆలాపన చేస్తూ చాలాసేపు కూర్చున్నాడు.

చుట్టూరా చేరిన అమ్మలక్కలు ఊపిరి బిగపట్టి నిశ్శబ్దంగా నుంచున్నారు. ఆ దాసుని ఆలాపన క్రమంగా పారవశ్యానుభూతిని కలిగించే రాగంగా ధ్వని పెరుగుతూ వచ్చింది. దాదాపు అర్థగంట తర్వాత జ్యోతి పువ్వులు రాల్చింది.

వాళ్ల కులదేవత! పోలేరమ్మ!

తళతళ మెరుస్తున్న కంచు ముంత, వెలుగుతున్న జ్యోతులతో దాసుడు తన తలమీద పెట్టుకున్నాడు.

దాసుడు కంఠం హెచ్చించాడు.

'ఓరి నరుడా... నరుడా... నరుడా... నీవు కంటి కింపయినది కనిపిస్తే నన్ను మరచిపోతావురా? నరుడా... ఓరి నరుడా... నీకు నీవే శత్రువ్విర... నన్నిడవవుర

నరుడా... దూతలు నన్నిడవవురా' అంటూ తనని ఎప్పుడో ఆ ఇంటివాళ్లు మరచారని, ఆ కుటుంబాన్ని ఎన్నెన్నో కష్టాల్లో కాపాడుతున్నానని చెప్పింది పోలేరమ్మ. నీ పుష్పానికి నీడనై కాపాడుతున్నానురా నరుడా... దూతలు తినేస్తున్నార్రా... నా యాగభోగాలు మరచినావురా... నాకు పూజా పుష్పమూ లేదురా... నా గుడిలో ధూప దీపాలు లేవురా... అని తన కోరిక చెప్పేసింది వారి కులదేవత పోలేరమ్మ.

'తల్లి పిల్లమీద కోప్పడితే అవుతుందా తల్లీ? ఆ పసికందుని అలా పీడించడం నీకు తగునా తల్లీ. నీకన్నా మాకు ఇంకో దిక్కు ఎవరున్నారమ్మా. నీవే కాపాడాలి తల్లీ. నీవే చమించాలి తల్లీ. ఆ పిల్లవాడిని కాపాడుతల్లీ. నీవు కోరినవన్నీ చెల్లించుకుంటాం తల్లీ.' అని అక్కడున్న అమ్మలక్కలు తల్లిని వేడుకున్నారు. పసుపునీళ్లల్లో స్నానం చేయించి దేవతను శాంతింపజేశారు.

కొడుకు పదిదినాల్లో లేచి కూర్చుంటే వచ్చే భాద్రపదమాసంలో మొక్కుబడి తీరుస్తానని చెప్పుకుంది రత్నాలమ్మ.

* * *

అమ్మవారికి మొక్కుబడి చెల్లించే ఆ రోజు వచ్చింది. ఉదయం నుండి రత్నాలమ్మకి సందడిగా ఉంది. తేనెరంగు ఆమె శరీరపు సొగసుకు మాతృత్వశోభ తోడయింది. చూపుల్లో భక్తిభావంతో సంతోషం. పొడవైన శరీరం. సన్నగా నిండుగా ఉందామె. ఆ ఇంట్లో అది పెద్దపండగే. కావలిసిన వాళ్లంతా వచ్చి ఆమెకి సహాయపడుతున్నారు. సాయంత్రం సూర్యభగవానుడు అస్తమించక ముందే అంతా అమ్మవారి గుడికి చేరుకోవాలి. ఆ సమయానికి ముందే దాసుడు వస్తాడు.

కొండలమీద పశ్చిమ ఆకాశాన మేఘాలు నీలంమణులతో సూర్యునికి విశాలమైన దేవాలయాన్ని కట్టి రంగురంగుల దీపాలు వెలిగించాయి. వేడుకలతో మొక్కుబడులతో, బాజా భజంత్రీలతో భక్తజనంలా దూరం నించి రంగురంగుల మేఘాలు వస్తున్నాయి. పైరుగాలి పరవశంగా పదాలు పాడుకుంటూ పంట చేలపై నాట్యం చేస్తున్నది.

కొత్తప్రవాహంలా జనం నడుస్తున్నారు. నవవధువును చూస్తున్నట్టున్నాయి పచ్చటి చెట్లు. ఊరు చుట్టూ సస్యశ్యామలమైన పొలాలు. ఆ పొలాల మధ్యనించి పోయే దారిలో వేడుకలతో పోతున్నారు జనం.

రత్నాలమ్మ పూజ నెత్తిన మోస్తున్నది.

దాసుడు ధూపదీపాలు దారిపొడుగునా అర్పిస్తున్నాడు.

ఉపవాస దీక్ష వల్ల, భక్తి ఆవేశం వల్ల, ఆమె లాక్షారుణ రూపం తేజోవంతమైంది. దైవత్వం ఆవహించినట్టుంది. ఆ సౌందర్యం ఆ ఊరేగింపుజనంలో తన్మయానందాన్ని కలిగిస్తున్నది. ఆమె కండ్లలో పవిత్రమైన ఆకర్షణ. ఆమె నడకలో ఆగోచరమైన లావణ్యం.

దాసుడి దగ్గరే ఉండి అప్పన్న అడిగినదే తడవుగా కావలసినవన్నీ దాసుడికి అందిస్తున్నాడు. గుగ్గిలం, తీర్థజలం, పూలు, పసుపు, కుంకుమ... భార్య రత్నాలమ్మ అప్పుడు అమ్మవారు... పోలేరమ్మ. అమ్మలకి అమ్మ.

రత్నాలమ్మ ఎవరినీ చూడటం లేదు. ఆమె హృదయంలో అమరగానం దివ్య సందేశాలు విన్పిస్తున్నాయి. ఆ జనమూ, ఆ కోలాహలమూ ఆమెకి పట్టటం లేదు. వేణుగానంవేపు పరుగుతీసే గోమాతలాగ పోతున్నదామె. రత్నాలమ్మ ఇప్పుడు దాసుడు రాగాలకి లయకలిపి పరుగులాంటి నడకతో ముందుకు పోతున్నది.

ఆ పచ్చటి పొలాల మధ్య నాలుగయిదు ఎకరాల విశాలమైన మెట్ట మీద రెండు మూడు నిలువుల ఎత్తు చిన్న గుడి. ఆ గుడిని కప్పుతూ పెద్ద వేప చెట్టు. ఆ వెనక గుడికి దక్షిణదిక్కున మామిడి చెట్లూ... ఇంకా పూలతోట. ఈశాన్యంగా నుయ్యి. ఆ నుయ్యి దగ్గర బూరుగు చెట్టు. ఆ వెనక మొగలిపొదలు.

ఊరేగింపు గుడిచేరింది. భక్తజనం గాలికి ఊగే పూలతోటలా కన్పిస్తున్నారు.

దాసుడు గుడిలోకి పోయి పోలేరమ్మకు ఆడమ్మలు కడవలతో, తెచ్చిన నీళ్లతో అభిషేకం చేస్తున్నాడు. ముద్దలుముద్దలు పసుపు పూస్తున్నాడు. కొత్తచీర కడుతున్నాడు. పూల అలంకరణ, కుంకుమ బొట్టు...

భక్తి పారవశ్యంతో రాగాలాపన చేస్తున్నాడు.

బాజా భజంత్రీలు మోగుతున్నాయి.

రత్నాలమ్మ... దాసుడు చెప్పినట్లల్లా చేస్తున్నది.

ఆమె మనుషుల్ని చూస్తున్నట్టు లేదు. చివరకు తన దగ్గర్లోనే ఉన్న కొడుకును సైతం చూడటం లేదు.

త్వరగానే పూజ సందడి ముగిసింది.

గుడి ఎదురుగా చేరిన భక్తజనులంతా పక్కకి ఎడంగా తప్పుకున్నారు. దేవి చూపులకు ఎదురుగా, పదిగజాల దూరంలో, మేకపోతును నిలబెట్టారు. మచ్చలేని నల్లని మేకపోతు. బలంగా పెరిగింది. దాన్ని బలి ఇచ్చి మొక్కుబడి చెల్లించాలి. దాన్ని గుడిముందు సరిగ్గా నిలబెట్టటానికి నలుగురు సహాయం అవసరం అయింది. దాని కొమ్ములకు ఆరేడు అడుగులు పొడుగాటి బలమైన వెదురు కర్ర కట్టి ఓ యువకుడు

పట్టుకున్నాడు బలంగా. దాని బలం దగ్గర ఈ నలుగురు యువకులు పనికి రాకుండా పోతున్నారు. దేవిముందు నిర్బంధించటం ఇష్టం లేనట్టు అది దూకబోతున్నది. వెనక కాళ్లతో గంతులేసి ఎగురుతున్నది. ఓ దృఢకాయుడు వెనక రెండు కాళ్లు గట్టిగా పట్టుకోవాల్సి వచ్చింది.

గుడిలోంచి దేవి అంతా కళ్లార్పకుండా చూస్తున్నది. జగన్నాథస్వామి దగ్గర సుభద్రాదేవిలాగ గుండ్రనికళ్లు. పసుప్పచ్చని ఛాయ. నల్లని ఎర్రంచుచీరె. అభయ హస్తం. సృష్టిలోని ప్రేమతో కరుణామృతమైన చూపులు. అంతటి ప్రేమమూర్తి ఈ మేకపోతు బలి కోరిందని అక్కడ భక్తజనం అంతా నమ్ముతున్నారు. ఈ బలి వద్దు అని ఎవ్వరూ చెప్పటం లేదు. చిన్న పిల్లలని దూరంగా ఉంచుతున్నారు పెద్దవాళ్లు. కాని బాబును ఎత్తుకున్న రత్నాలమ్మ తమ్ముడు మాత్రం ఆ మేకపోతు బలిని చూడాలని దగ్గర్లోనే నిలబడ్డాడు.

మెరుపులాగ మెరుస్తున్న కత్తి బలంగా పిడుగులా కిందికి పడే సరికి మేఘాలు ఆఖరిగా ఉరిమి రక్తంలో మునిగితేలాయి. తమ్ముడు ఎత్తుకున్న బాబు మేకపోతు తలతెగి కిందపడిపోవటం, రక్తం దేవి ఎదురుగా చిమ్మడం, నేలమీద పడిపోయిన మేకపోతు శరీరం గిజగిజ తన్నుకోవడం చూశాడు. మేకపోతు తన మీంచి ఎగురుతున్నట్టు తనని తొక్కుతున్నట్టు అన్పించి కళ్లుమూసికొని పెద్దకేక వేశాడు. ఆ కోలాహలంలో ఆ కేక కలసిపోయింది.

సూర్యుడు అస్తమించాడు.

జనం ఇళ్లకు తిరిగిపోతున్నారు. అమ్మవారి పూజలు, మొక్కు బడులు సంతోషంగా జరిగినందుకు జనం ఆనందంగా ఉన్నారు. రత్నాలమ్మ ఇంకా పరవశానందంలోనే మునిగి తేలుతున్నట్టుంది. ఆమె చూపుల్లో అమ్మవారి కళ శోభిస్తున్నట్టుగా ఉంది. ఆమె ఎవ్వరితోనూ మాటాడటం లేదు. జనం మాత్రం అమ్మవారి మహత్యాలు, తమ తమ అనుభవాలు, స్వప్నాలు, కథలు కథలుగా చెప్పుకుంటూ తిరిగిపోతున్నారు.

దాసుడు మెడలో పూలహారంతో పూజాలంకారాలతో జనం మధ్యలో నడుస్తున్నాడు.

దాదాపు వందమందికిపైగా ఉన్న జనంలో ఎక్కువమంది ఆడవాళ్లు, బాల బాలికలే.

ఆ జనం వెనక ఆ బలి ఇచ్చిన మేకపోతును కట్టెకు వేలాడదీసి ఇద్దరు మనుషులు మోసుకువస్తున్నారు.

ఆకాశంలో అర్ధచంద్రుడు కన్పిస్తున్నాడు. కొంగల బారుల్లాగా తెల్లటి మేఘాల చారలు. ఆలమందలు, గొర్రెల మందలు, మేకల మందలు పగలంతా దగ్గర కొండల్లో మేత మేసుకుని ఊళ్లోకి వస్తున్నాయి. పల్లె పదాలు పొలాల్లోంచి వినిపిస్తున్నాయి.

రత్నాలమ్మ ఇల్లు చేరుకుంది. ఆమెతో పాటు ఆమె ఇరుగు పొరుగు వాళ్లంతా వచ్చారు. ఇంట్లో దేవుని గదిలో పూజా పళ్లెం పెట్టి దాసుడు చెప్పినట్టు పూజలు చేసింది. ప్రసాదం అందరికీ మరోసారి పంచి పెట్టారు. పానకం తాగినంత అందరికీ ఇచ్చారు. అరటి పళ్లు, కొబ్బరి కోరు, అటుకులు, పాలు, బెల్లము, సుగంధ ద్రవ్యాలతో చేసి నైవేద్యంగా పెట్టిన ప్రసాదం అరటి ఆకులలో పెట్టి అందరికీ ఇళ్లకు తీసుకుపోవటానికి గాను వచ్చిన వాళ్లందరి చేతుల్లో పెట్టారు. ఇంట్లో దీపాలు. అరికేన్ లాంతర్లు. బైట అరుగు మీద చూరుకు వేలాడుతున్న లాంతర్లు. రత్నాలమ్మకి ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నట్టయింది. ఆమెకి నోరొచ్చింది. మాట్లాడింది. నవ్వింది. 'అంతా ఆ తల్లి దయ' అని సంతృప్తి చెందింది.

మెలమెల్లగా జనం వెళ్లిపోయారు... రాత్రి వంటలు చేసే వేళ అయిందేమో... ఆ ఇల్లు నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా ఉంది.

పెరట్లో ఎండిపోయి మోడవుతున్న చెట్టు కింది కొమ్మకి మేకపోతు రెండు కాళ్లను కట్టి చర్మం వొలిచిన దృశ్యం పల్చటి వెన్నెల్లో కన్పించింది. నలుగురయిదుగురు అక్కడ చేరి కత్తులతో కోసి మాంసపు ముక్కలు తీసి క్రింద పరచిన పచ్చి తాటికమ్మల మీద వేస్తున్నారు. కొద్ది సేపట్లో బలిచ్చిన ఆ మేక మాంసం ఊళ్లో కావలసిన వాళ్లందరికీ పంచి పెట్టారు. ఎవరి పనుల్లో వాళ్లు అంతా మునిగి ఉన్నారు.

రత్నాలమ్మ వీధిలోకి వచ్చింది.

వీధి వాకిట జనం గుంపు కన్పించింది. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. వైద్యుడు గొంతు విన్పిస్తున్నది. వాళ్లల్లో పొడవుగా తమ్ముడు కన్పిస్తున్నాడు.

ఏమయింది? ఎవరు? ఎవరు? ఆ వెన్నెల చీకట్లో అంతా అక్కడ ఎందుకు పోగయినట్టు?

తమ్ముని చేతిలో బాబు తల వేలాడిపోయి కన్పిస్తున్నాడు.

అందరి కళ్లలో భయం. అందరి ముఖాల్లో బాధ.

ఏమయింది... ఏమయింది...

పిల్లవాడిని వాకిట్లోంచి అరుగు మీదికి తెచ్చారు. బొంత తెచ్చి దాని మీద

పడుకోబెట్టారు. మరోసారి వైద్యుడు పిల్లవాడి చేతిని పట్టుకుని నాడి చూశాడు. పిల్లవాడి కళ్లు తన చేత్తో తెరచి చూశాడు. నిశ్శబ్దంగా ఉండిపోయాడు కొద్దిసేపు. ఆ పిల్లవాడి నోరు తెరిచి మందు నోట్లో పెట్టాడు. ఆ పిల్లవాని పాదాలూ, చేతులూ నెమ్మదిగా రాస్తూ ఉన్నాడు. రత్నాలమ్మ కొడుకును చూసింది.

కళ్లు చీకట్లు కమ్మాయి. భూమి గిర్రుగిర్రున తిరగసాగింది. శూన్యంలోకి ఎవరో బలంగా విసిరేస్తున్నట్టయింది. ఆమె కుప్పకూలినట్టు నేలమీద కూలిపోయింది.

వైద్యుడు ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమె తలని తన ఒడిలో పెట్టుకుని పరిచర్యలు మొదలుపెట్టాడు. చల్లని గాలి కొంతసేపు విసనకర్రతో వీస్తూ... చల్లని నీళ్లతో ఆమె ముఖాన్ని కడుగుతూ... రత్నాలమ్మా... లే లే... నీ బాబు బాగున్నాడు లే... లే లే...

'నీ కొడుకు బాగున్నాడు... లే లే... కళ్లు తెరువు. కళ్లు తెరువు. నీ కొడుకును చూడు...'

* * *

రత్నాలమ్మ కళ్లు తెరిచింది...

'బగమంతుడు...' అని పెదవి విరిచారు అక్కడ ఉన్న జనం.

అప్పన్న హృదయవిదారకంగా బాబును గుండెకి హత్తుకుని ఏడుస్తున్నాడు. ఆ చుట్టూ చేరిన జనం కూడా కంటనీరు పెట్టుకున్నారు.

తల్లిమేక మాత్రం ఇది ఎప్పుడూ ఉండేదేలే అన్న సత్యం తనకు తెలిసినట్టు, ఈ ప్రపంచం అంతా మిధ్య అన్నట్టు, తనకు ఇదేదీ పట్టనట్టు, సుఖదుఃఖాలకు అతీతంగా, నిర్విచారంగా నెమరు వేసుకుంటున్నది. మేకపిల్ల కూడ.

* * *

'భారతి' సాహితీ మాసపత్రిక
జనవరి *62.*